యర్రమిల్లి ప్రభాకరరావు

# కానుక

రేపు నా పుట్టినరోజు. అంటే నలభై నిండి నలభై ఒకటవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నానన్నమాట.

''సాయంకాలం పెందరాళే వచ్చేయండి. షాపింగ్‌కు వెళ్దాం'' అని మా ఆవిడ ఉదయమే ఆఫీసుకు వెళ్ళేటప్పుడు హుకూం జారీచేసింది. ఇంక తప్పేదేముంది! నాలుగు గంటలకల్లా ఇంటికి చేరుకున్నా.

ఇంతలో మా అమ్మాయి అపూర్వ స్కూలునుంచి రిక్షాలో దిగింది. పదికేజీల బరువున్న పుస్తకాల బస్తాని దభీమని కింద పడేసి ''నాన్నా! బజారుకా, నేనూ వస్తాను'' అంటూ గబగబా వాళ్ళ అమ్మ దగ్గరకు పరుగెత్తింది. వాళ్ళ అమ్మ-

''వచ్చింది హిడింబి. రిక్షాలోంచి దిగడమే ఏదో హెలికాప్టర్‌లోంచి దుమికినట్లు ఉరుకుతుంది. ఆ... తయారుకా. దోసెలు టేబుల్‌మీద పెట్టాను. రెండు మింగి ఆ స్కూలు బట్టలు విప్పిరా'' ఆర్మీ కమేండర్ ఛీఫ్‌లా ఆర్డరు పాస్ చేసింది, తాను బట్టలు మార్చుకుంటూ.

అనుకున్నట్లుగా ఐదుగంటలకు ముగ్గురం బయలుదేరాం.

షాపింగు అంటే ఏమీలేదు. కొన్ని కిరాణా వస్తువులు కొనుక్కోవడం, ఆ తరువాత మా ఆవిడ నాకు నూట ఇరవై, నూట యాభై రూపాయల మధ్య ఒక రెడీమెడ్ షర్టు కొనడం పుట్టినరోజు కానుకగా. నెలాఖరు. చేతిలో అతికష్టంమీద మూడువందల రూపాయలు మిగిల్చింది చంద్ర. నిన్న రాత్రి మా ఆవిడ చంద్ర ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ఇండియా లెవెల్లో బడ్జెట్ తయారుచేసింది. కాటన్ షర్ట్ నూట ఇరవై రూపాయలు, నా పుట్టినరోజు సందర్భాన చేయబోయే స్పెషల్ స్వీట్ పాయసానికిగాను అవసరమైన సేమ్యా, పంచదార, జీడిపప్పు, ఏలకులు, కిస్‌మిస్ వగైరాలు నలభై రూపాయలు, మిగిలిన అత్యవసర కిరాణా సామానులు ఒక వంద రూపాయలు. ఈ లోబడ్జెట్ ఖర్చుపోను ఇంకా నలభై రూపాయలు వుంటాయని ఆవిడ అంచనా.

నేను ''చాలా చక్కగా బడ్జెట్ ప్రజెంట్ చేశావు. అప్పర్ హౌస్, లోయర్ హౌస్ రెండూ నేనే కాబట్టి ఏకగ్రీవంగా ఆమోదించా. రేపు బడ్జెట్‌ను అమలులో పెడదాం సాయంకాలం ఆరుగంటలకు'' అన్నాను నవ్వుతూ.

''మీకేం నవ్వులాటగా వుంటుంది. ఈ నెలలో ఈ మూడువందలూ మిగిల్చేటప్పటికి తల ప్రాణం తోకకొచ్చింది. అసలు మిమ్మల్నెవరు నెలాఖరున పుట్టమన్నారు. అందులోనూ మార్చి నెలలో... ముప్పై ఒకటో తారీకున. ఏమైనా డబ్బులు కావాలని అడిగితే ఇన్‌కమ్ టాక్స్, డిడక్షన్లు, ఎన్‌ఎస్‌సీలు, యూలిప్‌లు అని మొదలుపెడతారు సీరియల్ కథ. మిమ్మల్ని అని ఏం ప్రయోజనం. మిమ్మల్ని కన్న ఆ మహాతల్లిని అడగాలి. ఏ లోకాన వుందో నేను ఛస్తున్నా. పోతూ పోతూ చేతిలో చెయ్యి వేయించుకుంది మరీ జాగ్రత్తగా చూసుకొమ్మని. అక్కడికి నేనేదో బ్రహ్మారాక్షసినైనట్టు. ఏదో మేనత్త కాబట్టి మాట నిలుపుకుంటున్నాను'' ఆ వీధి అంతా వినిపించేటట్లు కంచుకంఠంతో ఈ లోకంలో లేని మా అమ్మనీ, నన్నూ కలిపి ఒక్క స్పీడులో ఝాడించింది. నేను నెమ్మదిగా అక్కడ్నుంచి తప్పుకున్నా. మా అమ్మాయి అపూర్వ నవ్వుతూ నా పక్కకి వచ్చి ''నాన్నా! అమ్మ ఏదో వార్ డిక్లేర్ చేసినట్లుందే. ఏకే ఫార్టీసెవెనా, బోఫోర్స్‌గన్నా? ఏది పేలుస్తోంది'' అంటుండగానే వాళ్ళ అమ్మ ''ఊ...చాలు తండ్రీ కూతుళ్ళు ఏకమై నన్ను వేపుకు తింటున్నారు. నీకసలు బుద్ధిలేదే. పెద్దవాళ్ళను వెక్కిరిస్తావా. అందునా తల్లిని. రేపు టెన్త్ రాయాలి. చదువులో చూస్తే లాస్టు, ఇటువంటి వ్యాఖ్యానాలు చేయడంలో మాత్రం ఫస్టు'' అంటూ మా అమ్మాయిపై విరుచుకుపడింది.

అపూర్వ మొహం చిన్నబోయింది. ఏదో సరదాగా మాట్లాడితే మా ఆవిడ సీరియస్ అయిపోయింది. నేను వెంటనే టేబుల్ మీద వున్న తెల్లరుమాలు చేతిలో తీసుకుని ఎగరవేసా. సీజ్ ఫైర్‌కు సిద్ధపడినట్లుగా నవ్వుతూ. క్షణంలో సీన్ మారిపోయింది. మా ఆవిడ పెద్దగా నవ్వింది. అపూర్వ వెంటనే రంగంలోకి దుమికింది.

''ఏంటీ! ఆ లంకిణీ నవ్వు?'' అంది నన్ను అనుకరిస్తూ. ఆ తర్వాత ఇల్లంతా నవ్వులే నవ్వులు.

నేను పుట్టిన మొదటి సంవత్సరమే నా నాన్న పోయారు. మా అమ్మే పెంచి పెద్దచేసింది రెక్కలు ముక్కలు చేసుకుని. నేను ఒక్కడినే కాబట్టి అతి గారాబంగా పెంచింది. కాలేజీ చదువు మా మేనమామగారింట్లో చదువుకున్నా. బికాం పూర్తిచేసి బ్యాంకులో చేరాను. మామయ్య నాకు దేవుడితో సమానం. ఆయన పెద్ద కూతురిని వివాహం చేసుకొమ్మని అడిగాడు. అమ్మ అభిప్రాయం కూడా అదే. నాకు కూడా చంద్ర అంటే ఇష్టమే.

చంద్రిక సీరియస్‌గా మొహం పెట్టి ''నాతో జీవితమంతా పడగలవా నువ్వు? అసలే అత్తయ్యకి ముద్దుల బిడ్డవి'' అని గట్టిగా నవ్వి నా రెండు బుగ్గలూ సాగదీసి ఇంట్లోకి పారిపోయింది. నాకు ఆ రోజు ఇంకా గుర్తే!

తరువాత మా పెళ్లి కావడం, జీవిత క్రమంలో పెద్దవాళ్ళందరూ నిష్క్రమించి మేము మిగలడం, కొన్నిరోజులు జీవితం నిరాసక్తంగా గడవడం ఒకదాని తరువాత ఒకటి జరిగిపోయాయి. ఆ తరువాత అపూర్వ వెన్నెలలా ప్రవేశించి మాకు కొత్త జీవితాన్ని, రుచులను చూపెట్టింది. నేను ప్రమోషన్ వద్దని విశాఖపట్నంలోనే ఉండిపోయాను. మా బంగారు అపూర్వ ఇప్పుడు పధ్నాలుగు సంవత్సరాల బాలికగా రూపుదిద్దుకుంటోంది. బాగానే చదువుకుంటోంది. ఆట పాట అన్నీ వస్తున్నాయి. అంతా తల్లి పోలిక. శరీరఛాయ గులాబీ రంగు. పెద్దయితే బొద్దుగా వాళ్ళ అమ్మలా వుంటుంది. నాకు గారం. మా ఆవిడ 'అలా గారం చేయకండి. ఎందుకూ పనికిరాదు. దాని వయస్సుకి నేను మా ఇంట్లో పనంతా ఒక్క చేతితో చేసేదాన్ని' అంటూ ఉంటుంది సమయం చిక్కినప్పుడల్లా. అదంతా శుద్ధ అబద్ధమని నాకు తెలుసు. నవ్వు ఆపుకోలేక పక్కకు తిరిగి పెద్దగా నవ్వుతా.


''ఏమిటీ ఆ రావణాసురుడిలా నవ్వు?'' అంటూ గయ్యిమంటుంది చంద్ర. మా అమ్మాయి మమ్మల్ని ద్దర్నీ చూసి పడీపడీ నవ్వుతుంది పొట్ట పట్టుకుని.

నా మస్తిష్కంలో గత స్మృతులన్నీ గుర్తుకువచ్చాయి. మేం నడుస్తూ సీతమ్మపేటకు వచ్చాం. మా అమ్మాయి, నేను వెనుకగా నడుస్తున్నాం. మా ఆవిడ మా ముందు ఠీవిగా నడుస్తోంది.

''మిలటరీ లెవెల్లో అమ్మ పైలెట్‌గా నడుస్తోంది నాన్నా'' అంది మా అమ్మాయి. నాకు భయంవేసింది

మా ఆవిడ వార్ డిక్లేర్ చేస్తుందేమోనని. ఆవిడకు వినబడింది కూడాను. కానీ చంద్ర పొజిషన్‌లోకి రాలేదు. కొంగు అడ్డు పెట్టుకుని ఫక్కాలున నవ్వింది. నాకు పెద్ద రిలీఫ్. పీస్ డిస్టర్బ్ కాలేదు. అపూర్వ గబగబా ముందుకు వెళ్ళి తల్లి చేయి పట్టుకుని గట్టిగా నవ్వేసింది.

నేను మా అమ్మాయి మీద ప్రేమని బహిరంగంగా ప్రకటిస్తాను. కానీ చంద్ర ఏ సందర్భంలోనూ కూతురిపై వున్న ప్రేమను బహిరంగ పరచలేదు. అది నాకు విస్మయాత్మకమైన సమస్యగా మిగిలిపోయింది. తల్లిగా తన బాధ్యతను ఏ లోటూ లేకుండా నిర్వర్తిస్తుంది. కానీ మరి ఇతరమైన ప్రేమానుభూతిని ప్రదర్శించలేదు. చంద్ర ప్రేమానురాగాలకు ప్రతీక. కానీ అపూర్వ విషయంలో వేరుగా వుంటుంది. ఈ విషయం నాకు చాలా విచిత్రంగా కన్పిస్తుంది. అపూర్వ ఇదేమీ పట్టించుకోదు. పైగా 'అమ్మకు ఏమీ తెలీదు నాన్నా. ఉత్త అమాయకురాలు, భోళా భారీ మనిషి' అంటుంది పెద్ద ఆరిందలా.



షాపింగు కార్యక్రమం మొదలయింది. మొదట కిరాణా వస్తువులు తీసుకున్నాం. అదొక డిపార్ట్‌మెంటల్ స్టోర్సు. చంద్ర లిస్టు ప్రకారం అన్ని వస్తువులు కట్టించింది. మా అమ్మాయి ''అమ్మా! పాలు రేపు ఉదయం తీసుకోవచ్చు పాయసంలోకి. కానీ కొద్దిగా నెయ్యి కావాలేమో'' అంది వాళ్ళమ్మతో. చంద్ర అమ్మాయిని మెచ్చుకోలుగా చూసింది. నోబుల్ ప్రైజ్ అవార్డు చేస్తున్నట్లు ''మంచి విషయం జ్ఞాపకం చేశావు. నాకు బుద్ధి లేదు సుమా. జీడిపప్పు మంచి నెయ్యిలో వేయిస్తేనే పాయసానికి రుచి'' అని ఒక పావుకేజీ నెయ్యి కూడా తీసుకుంది. మొత్తంమీద బిల్లు అనుకున్న దానికంటే ఎక్కువే అయింది. నూట ఏభై రూపాయలు పే చేసి సామాను పేక్ చేయించాం.

ఇంక అసలు ఐటమ్ నాకు బర్త్‌డే గిఫ్ట్‌గా మా ఆవిడ కొనవలసిన షర్ట్. అదే షాపులో రెడీమేడ్ షర్ట్స్ అమ్ముతున్నారు. ఆ సెక్షన్‌లోకి వెళ్ళాం నేను, చంద్ర. మా ఆవిడ షర్టులు సెలెక్ట్ చేస్తోంది. దాదాపు ముప్ఫై, నలభై షర్టులు తీయించింది. మొత్తం మీద ఒక బ్లూకలర్ షర్ట్ ఎర్రగళ్ళతో వున్నది ఆమె కళ్ళను కట్టివేసింది. సేల్స్‌మెన్‌లో ఏదో మాట్లాడుతోంది.

నేను కౌంటర్‌కు కొద్ది దూరంలో నిలబడి చూస్తున్నా. ఛాయిస్ అంతా చంద్రాకే ఇచ్చివేసా. ఆవిడ సెలక్షన్ నాకు శిరోధార్యం. ఎందుకంటే ఆమె అంటే నాకు ప్రాణం. ఇంతలో నా దృష్టి మా అమ్మాయివైపు పడింది. అపూర్వ కౌంటర్ మీద వున్న చిన్నపిల్లల బొమ్మలు, ఆట వస్తువులు చూస్తోంది. మేం ఎప్పుడు షాపింగ్‌కు వెళ్ళినా మా అమ్మాయి ఆ బొమ్మల దగ్గర నిలబడిపోతుంది. అందులో చాలా బొమ్మలు పెడతారు. ఈమధ్య వస్తున్న సాఫ్ట్ టాయిస్, ఫన్ టాయిస్, అంటే అపూర్వకు చాలా మక్కువ. తెల్లని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టిన కోతి, కుక్క, జిరాఫీ, కుందేలు, పెద్దపులి, జోకర్ మొదలైన బొమ్మలు రంగురంగుల ఫర్‌తో చేసినవి అక్కడ అమ్ముతున్నారు. కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి. మా అమ్మాయి వాటిని నెమ్మదిగా తీసుకుని తన చేతితో నిమిరి జాగ్రత్తగా పెట్టేస్తోంది తిరిగి. ఈ మధ్యకాలంలో నాలుగైదు సార్లు వచ్చినప్పుడు నేను చూసాను. అందులో ఒక చిన్న తెల్లని బొచ్చు కుక్క వుంది. అదంటే అపూర్వకు చాలా ఇష్టం. మంచులాంటి ఫర్‌తో చేసిన ఆ డాగీ చాలా ముద్దొస్తోంది. చిన్న చిన్న కళ్ళు, నోరు, పెద్ద చెవులు, వ్రేలాడుతున్న పాల నురగలాంటి జూలు, కూర్చున్నట్లుగా వున్న ఆ కుక్కపిల్ల ఎవరికి నచ్చదు? ఈసారి కూడా దానిని చేతిలోకి తీసుకుని ప్రేమతో తన చిన్న చేతితో నిమురుతోంది. షాపువాళ్ళు అపూర్వని ఏమీ అనరు. నేను వాళ్ళకి రెగ్యులర్ కస్టమర్‌ని. పైపెచ్చు సీనియర్ కస్టమర్‌ని. ఎప్పుడూ అరువు అడగను. నేను అటువైపు వెళ్ళాను. మా అమ్మాయి నన్ను చూసి గబుక్కున ఆ బొమ్మ కుక్కను దాని స్థానంలో పెట్టేసింది. ఏమీ తెలియనట్లు ఎటో చూస్తోంది. కానీ అపూర్వ కళ్ళల్లోని కోరికను, భాషను నేను చదవగలిగాను– ఆ బొమ్మ అంటే దానికి చాలా ఇష్టం ఏర్పడిందని, కానీ నన్ను కొని పెట్టమని అడగలేక పోతోందని. ఎందుకంటే ఇప్పుడిప్పుడే ప్రపంచం, ఆర్థిక సమస్యలు ఆ చిన్న మెదడుకి అర్థమవుతున్నాయి.

నేను అపూర్వ దగ్గరకువెళ్ళాను. ఆమె కౌంటర్‌లోవున్న సేల్స్‌బోయ్‌ని ఏదో అడుగుతున్నట్లుగా నటిస్తోంది.

''ఏమైనా కావాలా తల్లీ?'' అడిగాను నేను.


''ఏం లేదు నాన్నా. ఉత్తినే నిలబడ్డా. అమ్మ ఏం చేస్తోందో చూస్తా'' అంటూ తల్లి దగ్గరకు వెళ్ళిపోయింది.

నేను సేల్స్‌బోయ్‌ని ఆ బొమ్మ ఖరీదు ఎంత అని అడిగాను.

''వంద రూపాయలు సార్! మీకైతే తొంభైరూపాయలే. పాపకి బాగా నచ్చింది. వచ్చినప్పుడల్లా చూస్తుంది. పేక్ చేయమంటారా?'' గౌరవంగా అడిగాడు.

''ఊ...పేక్ చేసి కౌంటర్‌కు పంపించండి. కాష్ బిల్ వ్రాయించండి'' అంటూ మా ఆవిడ వద్దకు వెళ్ళాను.

## సూపర్‌స్టార్ హంతకుడు!



అత్యుత్తమ కార్యాలుచేసిన మహామహులకే కాదు, ఎన్నెన్నో దుర్మార్గాలు చేసిన నరరూప రాక్షసులకు సహితం పేరు ప్రఖ్యాతులు వస్తాయి! చిత్రంగానే ఉన్నప్పటికీ ఇది పరమ సత్యం! మహనీయుడైన అబ్రహం లింకన్‌ను కాల్చి చంపిన హంతకుడు జాన్ విల్‌కేస్ బూత్ ఎన్ని దారుణాలు చేసినప్పటికీ ఓ సూపర్‌స్టార్‌గా వెలుగొందాడు! ఎందరో అందగత్తెలకు సహితం అతణ్ని చూడగానే, గుండె గుబగుబలాడేది! యువకులకు జాన్ అంటే వల్లమాలిన అభిమానం.

మెగాస్టార్‌లకు రోజూ ఏవిధంగా కట్టలు కట్టలుగా ఉత్తరాలు వస్తాయో, అదేవిధంగా జాన్‌కు ఉత్తరాలు వర్షంలా కురిసేవి! ఎంతో పేరు పొందిన ఫోర్డ్ థియేటర్ లేఅవుట్ అంతా జాన్‌కు కరతలామలకమే! ఆ థియేటర్‌లోని సెక్యూరిటీగార్డులంతా అతని అభిమానులే. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొనే జాన్, లింకన్‌ను తుపాకీతో కాల్చగలిగాడు.

- కొడిమెల

నన్ను చూసి ''ఎక్కడకు వెళ్లారు మీరు? ఈ షర్టు చాలా బాగుంటుంది. మీ సైజే. మన బడ్జెట్‌లోనే వుంది'' అంటోంది చంద్ర.

''చంద్రా! ఇప్పుడేం అక్కర్లేదు. ఆ తర్వాత చూసుకుందాం. వచ్చేయ్. బాబూ...ఏమీ అనుకోకు. షర్టు ఇప్పుడు తీసుకోం. నీకు చాలా శ్రమ ఇచ్చాం'' అంటూ కేష్ కౌంటర్ దగ్గరకువచ్చేసా.

చంద్రిక బిల్లు పేచేసి బొమ్మతో బయటకు వచ్చేసింది షాపులోంచి. ఆమెకు చాలా కోపమొచ్చింది. మొహం ఎర్రగా జేవురించింది. అపూర్వకు ఏమి చేయాలో తోచలేదు. నాన్నగారు షర్టు కొనలేదని ఆ పసి మనసుకు అర్థమైంది.

''ఏమే! నాన్నను బొమ్మ కొనమని అడిగావా?'' అని వాళ్ళ అమ్మ గట్టిగా ప్రశ్నించేసరికి ఆ పసిదాని మృదువైన లేతబుగ్గల మీద నుండి కన్నీరు నయగారా జలపాతంలా ప్రవహించింది.

నేను ''చంద్రా! అపూర్వ అడగలేదు. నేనే కొన్నాను. దానిని ఏమీ అనకు'' అన్నాను.

''అవును. నేనెవరిని అనేందుకు? అది మీ ముద్దుల కూతురు. నా మాటకి విలువేం వుంటుంది'' అంది కోపంతో రుసరుసలాడుతూ.

ఇంక ఎవరం ఏమీ మాట్లాడుకోలేదు. రాత్రి ఇంట్లో ఏదో మొక్కుబడిగా తిన్నాం అంతే. ఇంట్లో వాతావరణం చాలా సీరియస్‌గా వుంది.

• • •

మరుసటిరోజు ఉదయం ఆరుగంటలకి చంద్ర నన్ను నిద్ర లేపింది. కాఫీ తాగి కూర్చున్నాక మా అమ్మాయి తన గదిలో ఏదో పనిలో వున్నట్టుంది. ఇంకా బయటకి రాలేదు.

''రండి. తలంటు పోస్తాను. మళ్లీ ఆఫీసుకి టైము అవుతుంది. వంట కూడా చెయ్యాలి'' అంది మా ఆవిడ. కొద్దిగా కోపం తగ్గినట్లుగా వుంది అనుకున్నానాలో నేను.

తల తుడుస్తూ ''కొత్త షర్టు కూడా కొనుక్కోలేదు. ఏం బట్టలు వేసుకుంటారో? వున్నవే మూడుజతలు. నిన్న నేను చాకిరేవుకూడా పెట్టలేదు'' అంది చంద్ర.

అప్పుడు నాకు గుర్తొచ్చింది. సరైన షర్టు లేదని. సరేలే ఏదో ఒక షర్టు వేసుకోవచ్చు అనుకుంటూ నా గదిలోకి వెళ్లాను.

నా గదిలో నాకు ఒక ఆశ్చర్యకరమైన విషయం కనబడింది. నా మంచం మీద నాకున్న పేంట్లలో మంచిది, ఒక ఇస్త్రీ చేసిన షర్టు నీట్‌గా పెట్టి వున్నాయి. మా అమ్మాయి మంచం దగ్గర అపరాధిలా నిలబడి వుంది.

నాకు అర్థమైంది. రాత్రి అపూర్వ షర్టు ఉతికి ఆరేసి ఉదయమే తడి ఆరిన వెంటనే ఇస్త్రీ చేసి ఉంచిందన్నమాట. నేను మా అమ్మాయి వంక చూసాను. నేను దగ్గరకు తీసుకున్నాను అపూర్వను. ఆమెలోనుండి కట్టలు తెంచుకుని దుఃఖం ప్రవహించింది.

''పిచ్చి పిల్లా. రాత్రి నిద్రపోలేదా?'' అని అడిగా.

లేదన్నట్లు తల వూపి బయటకు వెళ్లిపోయింది.

నేను వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నా. అపూర్వ కూడా స్కూల్‌కి రెడీ అయింది. పుస్తకాలు సర్దుకుంటోంది తన రూమ్‌లో. ఇంతసేపు వాళ్ల అమ్మ వంటింట్లో సతమతం అయిపోతోంది. నాకు భయం పిలవాలంటే. చంద్ర మూడ్ ఎలా వుంటుందో.

ఇంతలో చంద్ర ట్రేలో పాయసం కప్పులతో వచ్చింది. నన్ను చూసి నిశ్చేష్టురాలైపోయింది. ఆమె అందమైన, విశాలమైన కళ్ళు సంతోషంతో మిలమిలా మెరిసాయి.

''నేను బట్టలేమీ ఉతకలేదే? ఇవి...'' అంటూ ఆగిపోయింది. నేను ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నా.

''మీరేం చెప్పనక్కర్లేదు. నాకు అంతా తెలిసిపోయింది'' అని ''అపూర్వా'' అని పిలిచింది.

ఇద్దరి చేతులకి కప్పులు అందించింది. అపూర్వ పాయసం తాగి కప్పు కిందపెట్టి ''నేను వస్తాను. స్కూల్‌కి టైమ్ అయింది'' అంటూ బయటకు నడిచింది.

''అపూర్వా! ఈ రోజు స్కూల్‌కి లంచ్ అవర్‌లో కేరియర్ నేను తెస్తాను'' అంటూ గబగబా లోపలికి వెళ్లి ''తల్లీ! ఈ డాగీను మీ ఫ్రెండ్స్‌కి చూపించు. దీనికి ప్రెట్టీ అని పేరు పెట్టాను. జాగ్రత్తగా మళ్లీ తెచ్చేసుకో'' అంటూ మా అమ్మాయి చేతికి బొమ్మను ఇస్తూ అపూర్వని దగ్గరకు తీసుకుని బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టుకుంది.

''ఛీ..ఇదేమిటమ్మా'' అంటూ అపూర్వ స్కూల్‌బేగ్‌తో బయటకు పరుగెత్తింది 'ప్రెట్టీ...ప్రెట్టీ'' అనుకుంటూ.

నేను కూడా చంద్ర చేసిన ఈ చర్యకు విస్మయానందాలతో పడిపోయాను. నాలోని భయం తొలగిపోయింది. చంద్రా తల్లి మనసు నాకు అవగతమైంది. అపూర్వపై ఆమెలో ఇంతవరకూ దాగివున్న అనన్యమైన ప్రేమ ఆమె హృదయ కవాటాలని ఛేదించుకుని తిమిరాన్ని చీల్చిన సూర్యకాంతిలా ఒక్కసారి కన్నుల్ని మిరుమిట్లు చేసేటట్లు ప్రకాశించింది.

''మన అమ్మాయికి బాధ్యత తెలిసిందండీ. ఇంక నాకు ఏ దిగులూ లేదు'' అంది చంద్ర కన్నీరు తుడుచుకుంటూ.

నా గొంతు కూడా గద్గదమైంది. భావావేశాన్ని అణుచుకుంటూ ''నువ్వు నాకు ఇచ్చిన విలువ కట్టలేని కానుక అపూర్వే'' అన్నాను ఆమె చెవిలో నెమ్మదిగా దగ్గరకు తీసుకుంటూ.

★

